# విన వేడుక

శ్రీకృష్ణుడు జన్మించిన దెక్కడ?

అలనాడు మథురలో,

మానాడు, మాకనులముందు మా బందరులో--

అలనాడు - బందరులో, గొడుగుపేటలో గొల్లగూడెంలో.

అప్పటి సర్కారువారికి యిప్పటి ప్రభుత్వ అసాముల కున్నటువంటి చారిత్రాత్మక పరిజ్ఞానం, ప్రగతిశీలం, మస్తుగా లేని కారణానో ఏమో, గొల్లవారిని యాదవులను చేయకుండా, వారంతకుముందు తరతరాలుగా బ్రతుకుతూన్న తీరునే బ్రతుకనిచ్చారు.

ఆ గొల్లగూడెంలో, ఓ తగుపాటి గుడిసెలో, ఓ వెర్రి గొల్లాడి కడుపున, అప్పటికి పదిపద్దెనిమిది ఏళ్ళనాడు, ఓ ఆడపిల్ల పుట్టింది. తెలివితేటల్లో వాళ్ళ అయ్యే, మెరుగనిపించింది. పిల్ల చిలకలాగుండేది, పొద్దస్తమానం నవ్వుతూ ఉండేది; క్షణానికో నవ్వు నవ్వేది. దీన్ని చూసి తీరుబడి ఉన్నప్పుడల్లా వీళ్ళ అయ్య నవ్వేవాడు. ఆనవ్వు, ఆనోటా ఆనోటా కమ్ముకుపోయేది - ముప్పొద్దులా, గూడెం అంతా! ఆ నవ్వులు మాపేటలో వాళ్ళకి గుమ్మపాలు!

వాళ్ళ అయ్య, పేరు చెన్నయ్య. చెన్నుగాడంటే కాని, తెలియదు: మనిషి మాంచి ఉతారుగా ఉండేవాడు. చేతికందినంత మేరా నామాలు పెట్టుకునేవాడు. పచ్చగా కందిపోయి ఉండేవాడు. మెత్తగా మాట్లాడే వాడు.

అప్పటికే దేశవ్యాప్తమై ఉంటూన్న, పాలల్లో నీళ్ళు కలిపే ప్రక్రియ వీళ్ళ అజ్ఞానులు కావడంతో, తెలిసిరాలేదు. వాళ్ళు పిండినా, మేం పుచ్చుకున్నా అవి సిసలుగా పాలే. అలాటి పాలుపుచ్చుకున్నవాళ్ళ పాలిట - దైవం ఎందుకుండదట?

యీ చెన్నుగాడు సుద్దులు చెప్పడంలో మొనగాడు. వాడినోరు క్షణం ఊరుకుండేది కాదు. ఎప్పుడూ కృష్ణుడి పేరు రాపాడుతూనే ఉండేవాడు. ఆడగనివారిది పాపం. కృష్ణలీలలు త్రవ్వి తలకెత్తేవాడు. ఎదుట వినేందుకు మనిషి లేడో, ఏదుంటే దానికి చెట్టయినా పుట్టయినాసరే, కృష్ణకథామృతం, ఉగ్గుపట్టే వాడు పిచ్చిసన్యాసి!

వాడికూతురు, ముత్తెం (వాడిని, "వాడు" అనడం, ఏడుకొండల వాడిని, 'వాడు' అన్నట్లే. కాని పప్పూవణ్ణం వంటబట్టిన బాపన తలబిరుసుతనం కాదు.) అందరూ, ముత్తెమంటే ముత్తెం అనేవారు... పెట్టుడు పేరు యశోద అయినా....

పిల్లకు యీడొచ్చి, మిటారింపొచ్చింది. వచ్చినా, తనమానాన, నవ్వుల్లో పడి ఉండేది. కాని, ఆనవ్వు' నాలుగిందాలుకాలేదు. అనవాయితీగా ఓరచూపులుచూచే ఏ మగరాయుడు కానీ, ముత్తెంవంక పరకాయించి చూసిన పాపాన పోందే! ఆ మనిషిని పరకాయించి చూడటానికి ఎవరికి తరం?

కాని ఎవరికి అలవికానిపని, ముత్యానికి అతిసులువు అదేమిటంటారా? మిట్ట

మధ్యాహ్నం, రెండుజాముల వేళకు ఫిరంగి వేసే వేళ, ఆరుబయట నిలుచుని, సూర్యభగవానుడివంక, ఒక్క అరఘడియపాటు చూసేది. అది, ఎవడితరం? మొగానికి ఎండ కొట్టేది కాదు. పిల్లది కసుగందేది కాదు. అంతసేపూ నీడలో వున్నట్టే. ఆ చూపు చల్లగా ఉండేది.

ఆయేడు పిల్లకు మనువు చేద్దామనుకున్నారు, కులపు వాళ్ళందరూ కలసి. చెన్నుగాడికి, యింటి జోలి, జోక్యం ఎన్నడూ లేదు. వాడి పెళ్లాం లక్ష్మాయి. సహాలమూ దిద్దుకుపోయేది. దాని తమ్ముడి కొడుకొహడున్నాడు. వీళ్ళ మందలోనే పెరిగే వాడు, పోట్లగొడ్డులాటివాడు. వాడికేదో డబ్బు ఎరపెట్టి, ఆ మూడుముళ్ళూ వేయిద్దామనుకున్నారు, దాంతో ఆ మొక్కు తీరిపోతుందనుకున్నారు. యిలా అనుకుంటూన్న సమయంలో, ముత్యానికి నెలమసలింది. మొదట్లో రెండు మూడుమాసాల పాటు ఎవళ్ళూ పట్టించుకోలేదు. ఆ తరవాతనైనా, పిల్లది వెలుపల జేరడంలేదో, యేదో కుట్టుజేరిందని, చేతనైన మందూ మాకూ వాడిచూశారు. వాటికేం గుణమివ్వకపోగా, ఆనాటి కానాడు నునువు తేలుకుంటూ రావడంతో, పిల్లది నీళ్లోసుకున్నదని, రూఢిగా తేలిపోయింది. ఏమిటీమాయ అనుకున్నారే కాని, ఎవరూ వంకబెట్టలా? అందరూ ముక్కుమీద వేసుకున్న వేలు దించకముందే అయిదోమాసం వెళ్ళింది. వెన్నదిన మనసైంది, ఆరోమాసం వచ్చింది. నెల్లాళ్ళపాటు కేవలం మీగడతప్ప మరోహటి నోటబెట్టలా, యిహ, వేవిళ్ళూ, ఆపసోపాలూ, సకిలింపులూ, అలాఅలా నెలలు నిండినాయ్. కృష్ణాష్టమి దగ్గిరపడుతూంది! మూడు పొద్దులూ, మూగనొప్పులు వచ్చి నిలిచిపోయినాయ్. పండగ రేపనగా, ఆనాడంతా, పిల్లది మనలో లేదు, ఏడుగురు పట్టుకున్నా ఎగిరిపడేది. ఒపళానికి, కెవ్వున కేక పెట్టి, సొమ్మసిలిపోయింది. ఒక్క క్షణం అలాగే మాటాపలుకూ, కదలికా, మెదలికా లేకుండా పడి ఉన్నదల్లా, పుట్టిన బిడ్డ, పోరేడుతూన్నట్టు, అలాగుక్కపట్టి, కన్నా! కన్నా! అంటూ, మళ్ళీ నవ్వులోపడ్డది. పిల్లవాడు ప్రాకుతూంటే వాడి వెంటపడి తానూ ప్రాకేది. తారంగం వేసేది! కాళ్ళగజ్జెలు కట్టేది. అలా గాలితో ఆడుకుంటూన్నా, కృష్ణుడు దానికళ్ళెదుట ఉన్నట్టే. పిల్లవాడికి చిందులుద్రొక్కే యీడొచ్చినట్టుంది. ముత్తెం కాళ్ళకు గజ్జెలుగట్టుకుని, ఉన్నట్టుండి చివాలున ఓచిందు వేస్తూండేది. పిల్లవాడు, చేతికందకుండా పారిపోతే ఎక్కడెక్కడికో తరుముకుపోయి, ఎక్కడో వెదకి పట్టుకుని, బుజ్జగిస్తూ, యింటికి తీసుకువచ్చేది. ఎలా? కాస్సేపు వెన్ను నేసుకుని, మరో కాస్సేపు బుజాన ఎక్కించుకుని – అలా ఒక్క ఏడాదిపాటు సాగింది ఆ చిద్విలాసం! వాడకట్టున ఉన్న మనుష్యులకి, అంతమేరా, గొల్లగూడెం కాదు, అచ్చంగా రేపల్లెవాడే అక్కడ పెరుగుతూన్న కానరాని పాపడు, సనయాం తమవాడే! అనిపించింది. చూడ నోచిన నేత్రాలు జోలలుపాడగా, మౌనంగా, మ్రాగన్నుగా జేకొట్టంగా, సనాలు తిరిగింది. యిహ కృష్ణాష్టమిరోజులు, ముత్యం ఉన్నట్టుండి తొలినాటికి మర్నాటికల్లా పడుచుపిల్లల్లా, పండు ముత్తైదువై పోయింది. చిన్నప్పటి ఆ నేవళం తగ్గలేదు. సరిగదా, అదోతీరు, నిగారింపొచ్చిందా మొగానికి! అయితేనేం, ఈక్షణాన చూస్తే, వెయ్యేళ్ళకుముందు పుట్టిందా అన్నట్టుండేది. మరోక్షణాన అప్పుడే ఉయ్యాలలూగి నిదుర లేచిన పసిపాప వతు; కాని ఏవేళప్పుడు ఏకళనున్నా, మనిషికి ఒకటేకళ, పున్నమినాడు, నిలపాడిచినట్లు!

ఆ పండగల్లో, ఉట్టి కొట్టడం అనేది – అనాదిగా వస్తూవున్న వేడుకే! వేడుకంటే, ఎదుటివాళ్ళకు చూడవేడుకేగాని, నిజానికి అవంతు ఓ మిడి మేళం.

అప్పట్లో ఏం జరిగిందంటే--

ఆ కులంవాళ్ళు, నడికారువాళ్ళు నలుగురూచేరి ఒళ్ళు తెలియని పాళానికి కడుపునింపుకుని – తూలుతూ, తూగుతూ అడుగేయబోయినప్పుడల్లా లెక్కతప్పి, క్రమం తప్పి, బెడిసిపడి, పక్కవాడి మీదికి చిందేస్తూ – వుండుండి గాలిలోకి ఎగిరి పిల్లిమంతరం వేస్తూ వుట్టికట్టినచోట జేరి, వల్లమాలిన గందర చేసేవారు. కొంతసేపటికి ముందటి ఆ యెక్కు దిగిపోవడంతో – మనుషులు నిదానంలో పడి, రోసాలు పుట్టుకొచ్చి, ఎవడికి వాడే విద్దెలు చూపించేవాళ్ళు. అప్పుడు మటుకు నిజంగా కనుల పండువే.

ఉట్టి కొట్టడమంటే – పిల్లకాయలు జామచెట్టున కాయలందుకున్నట్టు కాదు. దానికి, ఓ లెక్క ఉంది – ఓ పద్ధతి ఉంది, దానికో పాటుంది – అందుకు తగిన ఆటుంది.

రేపల్లెవాడలో గోపాలయ్యా!
నువ్వు మాపున్నెమేనయ్యా గోవిందయ్యా!
ఉట్టిమీద వున్న చట్టిలోన వెన్న
యిట్టే మాయంజేసే సిట్టి బుల్లెయ్యా!
చల్లలమ్మబోతె సాటోరి పిల్లకాయ
బెల్లించి వడుపేసె బెమ్మాండయ్యా!...."

యిలా, చెమ్మకొడుతూ – (చెమ్మ అంటే చప్పట, అడుగేస్తూ – పాటపాడుతూ, ఆపై దరువు (చెక్క) అందుకుంటారు. (చెక్క అంటే మనిషీ మనిషీ – ఎదురై వేసే చేతాళం)

"సిటుకు సిటుకు సిటుకూ
సిక్కని యెన్న సినుకూ –
కొండమీద మెయిలేశి, కొండకింద మనకేసి –
,సిటాపటా సినుకోసి గోవులన్ని గొల్లుమంటె-
గోటిమీద గొడుగట్టాడే – కిట్టమ్మ
గొల్లోళ్ళకు దేవుడయ్యాడే!"

దీని తరువాత ఝుళుకు – (అంటే తాళం మరో లెక్కన)

"మేడలోనే పుట్టి, మేనమామనె గొట్టి
తాతకే పట్టంబు గట్టావు రన్నా...
అమ్మోరిపూజకూ ఆడకూతురు రాగ
అందలం దించావు అరద మెక్కించావు
మన్ను దిన్న .నోట యెన్న దింటావంట
ఎల్లకాలం నీవు బుల్లోడివేనంట...
ఎంత గట్టోడివిర కిట్టయ్యా!...
నువ్వు ఎంత గడుసోడివిర కిట్టయ్యా"

యిలాటివి ఆ సందర్భంలో పాడేవి, పెద్దలు చెప్పిన పాటలూ పదాలూ చాలా వున్నాయి, ఎవరికి వచ్చినవి వాళ్ళు పాడుతారు.

పాడటం అంటే – పదమెత్తుకునే పాటగాడు ఒక్కడే ఉంటాడు. తతిమ్మా వాళ్ళు దరువుకు చిందేస్తూ, వంతపాడుతారు.

యిక వుట్టికొట్టడం – దానిపద్ధతి ఎలా అంటే, ఉట్టి కొట్టే పిల్లగాళ్ళందరూ – దానికి ముమ్మారు చుట్టూ దిరిగివచ్చిన తరువాత, ఒక్కొక్కడే ఎగ్గామొగ్గా వేసుకుంటూ, (ఎగ్గ అంటే కూచుని కుప్పించడం) వుట్టికి అంగ దూరంలోకి వచ్చిన తరువాత – ముమ్మారుచొప్పున మనిషికి మూడొంతుల లెక్కను ఎగరవచ్చు. ఇలా ఎగురుతున్నప్పుడు ఎగిరేవాడ్ని గజిబిజి చేస్తూ వేడుక చూసేవాళ్ళు నానాగొడవా చేస్తూ, కేరింత లాడుతూ చిమ్మనగొట్టాలతో వసంతం కొడుతూ ఉంటారు. ఓ చెంపను అందినట్లే ఉన్న ఉట్టి కాస్తా వీడెగిరేసరికి అదీ పై కెగురుతూంటుంది. – ఎలా? దానికి గిల కేసి గిలకు్కు తాడోసి ఓ మనిషి ఎగదీస్తూ వుంటాడు.)

చివరకు ఎవడో ఒకడు, ఉట్టికొడతాడు–

అంటే పగులగొడతాడని కాదు. ఎగిరి అందుకుని ఆపళాంగా క్రిందికి దించుతాడు. దుత్తలో ఎంతో కొంత రొఖ్ఖం వుంటుంది – అది పెట్టి ఊరు మాటుమణగేదాకా అందరూ చిత్తుగా పండుగ చేసుకుని బడలిక తీర్చుకుని పండుకుంటారు.

యిదీ మామూలుగా నడిచేవేడుక.

కాని, ఆ యేడు అలా జరగలేదు. ముత్యం చెప్పినట్టు జరిగింది. ఎలా?

ఫలానాచోట ఉట్టి కడతామనుకున్న తరువాత, కల్లాపి జల్లి, పరకేరి పారేసి అంతమేరా అద్దమల్లే జేసి --

కోపుకోలుకి కుంకుమా పసుపూ పెట్టి –

(కోపుకోలంటే, రెండు పచ్చి వెదుళ్ళు మాంచి జివ వున్నవి లోతుగా పాతి, తలకట్టు గోపురమల్లే చేర్చి కట్టి, మయాన గుంటకట్టి, అడ్డకమ్మీవేసి దానికి పొన్నమండలు కట్టి దానికి మయం జేసి వుట్టి వ్రేలాడ కట్టడం–)

అలా కట్టిన ఉట్టికి ఎనిమిది శేర్లు –

ఉట్టిమీద మూడు దుత్తలు

దుత్తలకు సుద్దపూసి, సున్నంబూసి, కుంకుమ పెట్టి,

పై దుత్తలో వెన్న, తొలి దుత్తలో మీగడ, మలిదుత్తలో పాలు వుంచి, ఆ వరుసన దుత్తమీద దుత్త పెట్టి ఆ వుట్టి కెక్కించి.

చేతాడుకు మువ్వలు కట్టించగా

వుట్టికొట్టే మనుషులు శుచిగా, సుబ్బరంగా కట్టు చెంగులు విరిచికట్టి, నడుముకు కాసెకట్టి, కాళ్ళకు మువ్వలు గట్టుకుని ఉట్టికి ఎగరగా,

ఏ మనిషికి చేతికి అందితే ఆ మనిషి అట్లానే తెచ్చి, కులపెద్ద ముందుంచాలి.

అతడు అలా అందుకున్నవాడి జబ్బకు బాబు బందుకట్టి, సిగలో నెమలికన్ను పెట్టగా,

అందుకున్నవాడు, దుత్తలోనివి ప్రసాదంగా అందరికీ పంచి పెట్టాలి!

ఆనాటి నుండి మానాటి దాకా, అంత ముచ్చటగానే అన్ని కట్టుబాట్లతోనే ఆ వేడుక సాగింది. క్రమంగా అన్ని వర్ణాలవారికి, అది పండుగే అయింది.

మేమందరమున్నూ ఒకటో అరో ఉట్టి కొట్టినవాళ్ళమే – కోలూ కోపూ వేసిన వాళ్ళమే. గిరేళ్ళు పట్టి, దేవుడి ఉత్సవాల్లో ఊరేగిన వాళ్ళమే!

యీ వేడుక ఒక్క మగవాళ్ళకే కాదు!

ఆడువారికీ యిది, వేడుకే అయింది. కేవలం చూడవేడుకే కాదు, హెచ్చరించింది. మాలాటి కుఱ్ఱకారే, కాని, వాళ్ళు మహావైభవంగా అందుకుపోయినారు.

గొడుగుపేట కంపెనీతోటలో ఉట్టి కట్టేవారు. ఓ కారు పిల్లలకు కృష్ణవేషాలు వేయించి, వాళ్ళచేత ఉట్టి కొట్టించే వారు. అప్పట్లో ఊళ్లో వేడుకలన్నీ ఒక ఎత్తూ, అది ఒక ఎత్తుగా ఉండేది! యిప్పుడు, ఆ ముచ్చటాలేదు, మనుషుల కావేడుకా తెలియదు.

యీ వుట్టి కట్టడంలోనూ, రెండు పద్ధతులున్నాయి; అదిలో దశమినాడు ఉట్లపండుగ. కాని కొంతకాలానికి అష్టమి నాటికే వచ్చింది.

దేవుడూరేగుతూ వస్తూంటే ముందునడిచే వాళ్ళు అక్కడక్కడ కొప్పుకోలు నాటుతూ – ఊరేగింపు చేరవచ్చే దాకా ఉట్టి కొడుతూ ముందుకు సాగిపోతూండేవాళ్ళు. అదే ఎక్కువగా రివాజు. విడిగా, కోపుకోలు పండుగ చేసుకోవడం, చాలా తక్కువ!

ఉట్టికొట్టడం సాధారణంగా పొద్దుతిరిగే వేళకే సాగేది. ఓ చెంపను యిది యిలా సాగుతూండగా మరో చెంపను గరుడకంబం నాటేవాళ్ళు.

దానికి మా ప్రాంతాల వాడుకలో ఉన్న వైనమిదీ; కంబం పదునాలుగ గంగుళాలు కైవారం, పదునాలుగు అడుగుల నిడివీన్ని ఉన్న పాలమాను. అసలే అతినునుపు. దానికితోడు యింత వెన్న పులిమేవారు. మాని కొప్పున గరుడపక్షి, చెక్కడం పట్టినామం! కంబం వేసేవాడు అంటే ఎగబ్రాకేవాడు, ఎలాగో చేవడుపుల పట్టు చిక్కించుకుని పల్లటీలమీద పైకి వెళ్ళి వెన్ను విరుచుకుని దణ్ణం పెట్టి కృష్ణా ద్వారకావాసా! అని అంటూ అలా ముమ్మారనే లోపున ఎక్కినట్టుగానే దిగిరావాలి! యీ వేడుక ప్రొద్దుపోయేదాకా యిలా యిలా వెలుతురులో సాగేది!

గరుడకంబం వాల్చగానే, చడ్డీవరుస అది ఏ తెల్లవారు ఝామురాకానో అలా సాగుతూ వుండేది!

యిహ ఊరిలో తలోమూలా తలో వేడుకా తలకొక వేడుకగా ఉండేది!

సంజెదీపం పెట్టగానే స్వామివారు పొన్న వాహనం మీద ఊరేగుతూ వచ్చేవారు! ముందు భోగంమేళం (మా బందరులో – స్వామివారి ఊరేగింపు దాకా విందులకూ, ఉపాకర్మలకైనా ఆ కనువిందు హమేషా ఉండితీరవలసిందే) వాళ్ళకి ముందడుగెన భజనపాళి. బాణా చడ్డీ చేసేవాళ్ళు. పల్లట కొట్టేవాళ్ళు. తల్వార్ సాము చేసేవాళ్ళు. వాళ్ళకి ముందు గిరేళ్ళు, మునుముందు సన్నాయి, ఘనసెట్టు, తాషానౌబత్ వగైరాలూ అందరికీ ముందు అడుగు దేవుడంటి ఓ బ్రాహ్మణ పిచ్చివాడూ!

అప్పటి గిరేళ్ళ జట్టు ఏలావుండేదని!

అందరూ ఒకే సైజు మనుషులు (లావూ – సన్నం మినహాయిస్తే) అందరూ ఆ నెమలికన్ను తురాయి పెట్టుకుని లేతపసుపు రంగు కుడితీని లేసుకుని కావి ధోవతులూ, కాళ్ళ గజ్జెలతో ముక్తకంఠాన.

చందమామకన్న నేను చక్కని దానిరా చక్కానిదానిరా
సందుజూసి నాకు బన్న సరా లంపరా! లలన-
మగడు ఊరలేదు మంచి మాటలాడరా మురళిపాట పాడరా
ఆగడు శాయాక ఆకులుపోక లంపరా లలన...
అత్తమామ గలదాన్ని ఆరడౌదురా, అన్యాయమౌదురా
కత్తిపదునువంటి మగడు కలదాన్నిరా లలన....
చందమామ శ్రీచలువతేడుసం॥వేడి వెన్నెల
కాయసాగెరా నే తాళ లేనురా
వెంగళ్ళరాయ కాట్పాడి చెన్న కేశవా లలన...
నీరజాయతాక్ష నేను నిల్వలేనురా నిల్వంగ లేనురా!"

వగైరా యిలా పాడుకుంటో చెంగున దరువందుకుని

"అదిగో చంద్రుండుదయంబాయెను
వదలలేక నీ, వలలో జిక్కితి--"
మదానమదనా ధిమి మదనా...

యీ ఊపులో కోలాటం వేస్తుంటే అహో, చిన్నికృష్ణమ్మ అక్కడచిందేయకిక చూసేనా భక్తిపారవశ్యం అంటే, అదీ! బ్రతుకంటే అప్పటివాళ్ళది!

(ముత్యం మాట ఏమిటి? ఆ పై బ్రతుకెలాటిది అంటారా? ఏముందీ, ఆయేడే ఎవరో వెళుతుండగా వాళ్ళతో బాటు తీర్థాలు సేవించబోయింది. కాశీగంగోత్రిదాకా సేవించుకుంది. మళ్ళీ తిరుగుముఖంలో మధుర చేరుకుంది. మరేమైందో? యింకేమౌతుంది! నిరంతర హరిబోల్ హరిః)

మరొక్కమాట! ముత్యం మా కారు మనిషి కాదు. మా నాడు లేదు! మాముత్తవ సర్వలక్ష్మమ్మగారనే సర్వజ్ఞురాలు తాను కన్నారాచూసింది విన్నాను. విన్న వైనం విన్నవించుకున్నాను.

★ ★ ★